నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 2 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

బేల మండలం సదల్పూర్‌లో దండారీ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న

దీపావళి సంబురాలు

వేడుకల్లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో దీపావళి పండుగను గురువారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఇండ్లు, వ్యాపార కూడళ్లు, దుకాణాలను దీపాలు, విద్యుత్ వెలుగులతో పాటు అందంగా అలంకరించి లక్ష్మీపూజలు చేశారు. అనంతరం పటాకులు కాల్చారు. జిల్లాలోని గిరిజన గూడాల్లో దండారీ వేడుకల్లో గిరిజనుల గుస్సాడీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో జరిగిన దండారీ వేడుకల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. బోథ్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దండారీలకు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ చెక్కులను పంపిణీ చేశారు. దీపాయి గూడలో మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు పాల్గొని పటాకులు కాల్చారు.

నేరడిగొండలో తన నివాసంలో గుస్సాడీ వేషధారణలో నృత్యం చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలి

వల్లభాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ ఏఎస్పీ

నిర్మల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, పోలీసులు

- నిరల్ ఎస్పీ జానకీ షర్మిల
- ఘనంగా ఏక్తా దివస్

నిర్మల్ అర్బన్, నవంబర్ 1 : సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోలీసు సిబ్బందితో కలిసి ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఐక్యత ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం, దేశ సమగ్రత కోసం పోరాటమే ఊపిరిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యూనిస్ అలీ, సీఐలు ప్రవీణ్ కుమార్, నవీన్, ప్రేమ్ కుమార్, రామకృష్ణ, ఎస్ఐలు లింబాద్రి, సందీప్, సుమలత, జ్యోతిమణి, సుమాంజలి, సాగర్, ఏఎస్ఐ దేవేందర్, రవి కుమార్, రాజ శేఖర్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో..

ఎదులాపురం, నవంబర్ 1: ఆదిలాబాద్ పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ఏక్తా దివస్ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(ఆపరేషన్) బీ సురేందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ..సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశ తొలి హోం శాఖ మంత్రిగా సేవలందించారని దేశంలోని 565 సంస్థానాలను విలీనం చేయడంలో కీలకపాత్రను పోషించారని, ఇందులో హైదరాబాద్ సంస్థానం కూడా ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డీ వెంకటి, టీ మురళి, చంద్రశేఖర్, రిజర్వ్ సిబ్బంది, హోంగార్డు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌రావుకు అభినందన

కళాకారుడు ఆనంద్‌రావును సన్మానిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, నవంబర్ 1 : ఇటీవల సకల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీ లో చిత్రకళా ప్రదర్శన నిర్వహించి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముతో ప్రశంసలు పొందిన గోండు చిత్ర కళాకారుడు మడావి ఆనంద్‌రావును శుక్రవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అభినందించారు. శుక్రవారం పీవో క్యాంప్ కార్యాలయంలో ఆనంద్‌రావును శాలువాతో సత్కరించారు. మారుమూల గిరిజన గ్రామం రాసిమెట్ట నుంచి వచ్చిన ఆనంద్‌రావు దీపావళి పండుగపై ఇతిహాసం, ఏత్మాసూర్ పేన్ , ఆదివాసీ గుస్సాడీ సంస్కృతి, సంప్రదాయాలు కండ్లకు కట్టేలా చిత్రీకరించాడని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీవీటీజీ ప్రత్యేక అధికారి, బీఈడీ ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, జేడీఎం నాగభూషణం ఉన్నారు.

యూడీఏలతో జీపీల ఆదాయానికి బ్రేక్

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటు
- ఆదిలాబాద్ పరిధిలో 107, మంచిర్యాలలో 350, నిర్మల్‌లో 420 పల్లెలను చేర్చిన ప్రభుత్వం
- ఇక ఏ నిర్మాణమైనా యూడీఏల నుంచి అనుమతి తప్పనిసరి
- ప్రజలపై ఆర్థిక భారం

ఖజానా నింపుకునేందుకు సర్కారు కొత్త పోకడ

UDA
URBAN DEVELOPMENT AUTHORITY

మంచిర్యాల, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకునేందుకు కొత్త పోకడలకు పోతున్నది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. అభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సర్కారు చెబుతుండగా, ఈ విధానం వల్ల గ్రామ పంచాయతీల ఆదాయానికి గండి పడి, వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ఉమ్మడి జిల్లాలో మూడు యూడీఏలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు కాబోతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో నిర్ణయం తీసుకోగా ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు సంబంధించి జీవోలు జారీ అయ్యాయి. ఆదిలాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి ఆదిలాబాద్ మున్సిపాలిటీతో పాటు ఆరు మండలాల్లోని 107 పల్లెలు, మంచిర్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, నస్పూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లోని 350 పల్లెలు, నిర్మల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లోని 420 పల్లెలోను చేర్చింది.

పంచాయతీల ఆదాయానికి గండి

ఇప్పటికే ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు అథారిటీలు కొత్త కష్టాలను తెచ్చిపెట్టనున్నాయి. గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణ అనుమతుల నుంచి వచ్చే బెటర్‌మెంట్, డెవలప్ మెంట్ ఫీజులు ఇప్పటి వరకు పంచాయతీల ఖాతాల్లోనే జమ అవుతుండగా, అర్బన్ అథారిటీ పరిధిలోకి వచ్చిన తర్వాత మాత్రం డెవలప్ మెంట్ ఫీజులన్నీ అథారిటీ అకౌంట్‌కు చేరనున్నాయి. దీని వల్ల పంచాయతీలకు ఆదాయం పూర్తిగా తగ్గిపోతుంది. అప్పుడు పంచాయతీలు కేవలం ఆస్తి పన్నులు, చెత్త సేకరణ యూజర్ చార్జీల మీదే ఆధార పడాల్సి వస్తుంది. దీంతో పాటు అథారిటీలు రూపొందించే మాస్టర్ ప్లాన్ విషయంలోనూ ఎక్కువగా మండలాలను పరిగణలోకి తీసుకుంటారు. దీంతో రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, మిక్స్‌డ్ జోన్లుగా ప్రాంతాలు విభజన చేయాల్సి ఉంటుంది. ఫలితంగా ఎవరి ఇష్టానుసారం వాళ్లు నిర్మాణాలు చేసుకోవడానికి ఆస్కారం ఉండదు. పంచాయతీలు అనుమతులు ఇవ్వడానికి అథారిటీ చట్టాలు ఒప్పుకోవు. దీని వల్ల సమస్యలు వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. అలాగే, పంచాయతీల్లో వివిధ నిర్మాణ అనుమతుల ద్వారా వచ్చే ఆదాయాలను అథారిటీలు అదే పంచాయతీల్లో వెచ్చించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఈ రంగంలోని నిపుణులు చెబుతున్న దాని ప్రకారం చూస్తే అర్బన్ అథారిటీ అమల్లోకి వచ్చిన తర్వాత ఏ పంచాయతీలైనా సరే 300 చదరపు మీటర్లకు మించి విస్తీర్ణంలో నిర్మాణం చేయాలంటే ఆయా అర్బన్ అథారిటీల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే, జీ ప్లస్ 3 దాటే నిర్మాణాల అనుమతుల కోసం అర్బన్ అథారిటీకి వెళ్లాల్సిందే. అలాగే అర్బన్ అథారిటీ పరిధిలోకి వచ్చే ఏ పంచాయతీలో అయినా వాణిజ్య నిర్మాణాలు చేపడితే తప్పనిసరిగా అథారిటీకి వెళ్లాల్సిందే. అది ఏ చిన్న వాణిజ్య నిర్మాణమైనా సరే... ఉదాహరణకు కోళ్ల షెడ్స్ వంటి ఇతర ఎలాంటివైనా అథారిటీ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. దీనికి ఆయా అథారిటీల్లో నిర్ణయించిన మేరకు ఫీజులు కూడా భారీగానే ఉండే అవకాశం ఉంది. అలాగే, ఇంటి పన్నులు భారీగా పెరగనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అన్ని జిల్లాల్లోని పంచాయతీల్లో మాస్టర్ ప్లాన్ అమలు చేయడం కోసం జిల్లా టౌన్ కంట్రీ, ప్లానింగ్ ఆఫీసర్(డీటీసీపీ) ఉన్నారు. ప్రస్తుతం జిల్లా మొత్తాన్ని అర్బన్ అథారిటీ పరిధిలోకి తీసుకుంటున్న పరిస్థితుల నేపథ్యంలో ఈ విభాగం పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి

పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకం

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పేరుతో తీసుకుంటున్న ఈ నిర్ణయం వెనుక ప్రభుత్వం ఆదాయం పెంచుకోవాలన్న ఎత్తుగడ కనిపిస్తున్నా పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ రంగంలోని వివిధ నిపుణుల ద్వారా సేకరించిన సమాచారం చూస్తే.. అథారిటీలు అమల్లోకి వస్తే పంచాయతీలు ఆర్థికంగా పూర్తిగా చితికిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం పంచాయతీలకు వివిధ రూపేణా వస్తున్న పన్నులు, ఇతర ఆదాయాల్లో ఇక నుంచి మెజార్టీ శాతం అర్బన్ అథారిటీలకు సమకూరనున్నాయి. పల్లె ప్రజలు పంచాయతీలను విడిచి తమ పనుల కోసం అథారిటీల వెంట తిరగాల్సి వస్తుందని తెలుస్తోంది. అథారిటీల ఏర్పాటు, దాని వెనుక దాగి ఉన్న అంశాలను లోతుగా విశ్లేషించి చూస్తే పంచాయతీల మనుగడకు ఇబ్బంది తప్పదని తెలుస్తోంది. అర్బన్ అథారిటీల విస్తరణతో గ్రామ పంచాయతీల ఆదాయాలకు కోతలు పడనున్నాయి. వీటితోపాటు ఒక స్థాయి దాటిన భవన నిర్మాణ అనుమతుల కోసం, వాణిజ్య అవసర నిర్మాణ అనుమతుల కోసం ఇక ముందు అర్బన్ అథారిటీల వద్దకు వెళ్లాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల ఆయా గ్రామ పంచాయతీల పరిధిల్లో ఉన్న ప్రజలకు ఇబ్బందులు వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీ పరిధిలో గృహ నిర్మాణాలు, వాణిజ్య నిర్మాణాలు ఏవి చేసినా పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అక్కడి నుంచే అనుమతులు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉండే అవసరాలకు అనుగుణంగా, పంచాయతీ రూపొందించిన ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తీర్ణం వాటిని పరిగణనలోకి తీసుకొని నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. కాగా అర్బన్ అథారిటీ పరిధిలోకి వస్తే 30 ఫీట్లకు తక్కువగా రోడ్డు ఉండే అనుమతులు దొరకడం కష్టమే. అలాగే అర్బన్ అథారిటీ మాస్టర్ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇది పూర్తిగా స్థానికంగా ఉండే ప్రజలకు ఇబ్బందులు తీసుకువచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

సర్వేకు సన్నద్ధం

- ఈ నెల 6 నుంచి ఇంటింటా ప్రారంభం
- ఇండ్ల జాబితా సిద్ధం చేస్తున్న సిబ్బంది
- 56 ప్రశ్నలపై వివరాల సేకరణ

ఆదిలాబాద్ పట్టణంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులాల అంశాలపై ఇంటింటా సర్వే నిర్వహణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే బీసీ కమిషన్ పర్యటించి సర్వే విషయంలో అధికారులకు పలు సూచనలు చేసింది. కమిషన్ విచారణలో భాగంగా వినతిపత్రాలు అందజేసిన వారికి సైతం సర్వేలో అందరూ భాగస్వాములు కావాలని కమిషన్ సభ్యులు సూచించారు. జిల్లాలో ఈ నెల 6 నుంచి సర్వే ప్రారంభం కానుండగా 15 రోజుల పాటు కొనసాగనున్నది. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు 10 కుటుంబాల చొప్పున సర్వే చేస్తారు. ఎన్యుమరేటర్లకు మాస్టర్ ట్రైనర్లు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

6 నుంచి ప్రారంభం

జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులాల సర్వే ఈ నెల 6 నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలో 18 మండలాల్లో 7,08,972 జనాభా ఉండగా 1,62,046 కుటుంబాలకు చెందిన సర్వే చేపట్టనున్నారు. సర్వేలో భాగంగా 1816 ఎన్యుమరేటర్ బ్లాక్‌లను ఖరారు చేశారు. 1901 ఎన్యుమరేటర్లను నియమించగా సర్వే పర్యవేక్షణకు 192 మంది సూపర్‌వైజర్లను ఎంపిక చేశారు. 150 కుటుంబాలకు ఒక్కో ఎన్యుమరేటర్లు ఇంటింటా పర్యటించి కుటుంబాల వివరాలు సేకరిస్తారు. కుటుంబాల సంఖ్య పెరిగితే బై నంబర్లు ఇచ్చి సర్వే చేపడుతారు. 76 అంశాలపై 56 ప్రశ్నలకు ఒక్కో కుటుంబం నుంచి వివరాలను సేకరించాల్సి ఉంటుంది. పది మంది ఎన్యుమరేటర్లకు సంబంధించిన కుటుంబాలను ఒక్కో బ్లాక్‌గా గుర్తించగా సూపర్‌వైజర్లు పర్యవేక్షలుగా వ్యవహరిస్తారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఈ సర్వే కొనసాగనున్నది.

సర్వేలో ఒక్క ఇల్లు కూడా మిస్ కావద్దు : కలెక్టర్

భీంపూర్, నవంబర్ 1: ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 6 నుంచి చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేలో ఒక్క ఇల్లు కూడా మిస్ కావద్దని అధికారులు, సిబ్బందికి కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు భీంపూర్ మండల సరిహద్దు మారుమూల తాంసి(కే) గ్రామంలో శుక్రవారం అధికారులు, ఎన్యుమరేటర్లు రూపొందిస్తున్న ఇండ్ల జాబితాను కలెక్టర్ వెళ్లి పరిశీలించారు. మూడు రోజులపాటు ఎన్యుమరేటర్లు, సిబ్బంది ఆయా పంచాయతీల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాథమికంగా ఇంటి గోడపై స్టిక్కర్ వేస్తారని కలెక్టర్ తెలిపారు. ఇంటి నంబరు, కుటుంబ యజమాని పేరు, క్రమ సంఖ్య అందులో పేర్కొంటారన్నారు. తాంసి (కే)లో ఒక బ్లాకులో 170, మరో బ్లాకులో 120 మొత్తంగా 290 కుటుంబాలకు సంబంధించిన ఇండ్ల జాబితాను శుక్రవారం కార్యదర్శి, ఎఫ్ఏలు సిద్ధం చేశారు. సర్వేలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ప్రత్యేకాధికారి, డీటీ హరిదాస్, ఆర్ఐ రాందాస్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

సారంగాపూర్, నవంబర్ 1 : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు, సిబ్బందిని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాలపై వివరాలు సేకరిస్తామని ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కర్లను అతికించాలని, ఎలాంటి తప్పిదాలకు లేకుండా పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పండుగలకు ప్రాధాన్యమిచ్చింది బీఆర్ఎస్సే

- కాంగ్రెస్ హయాంలో గుర్తింపు కరువు
- మాజీ మంత్రి జోగు రామన్న

దండారీ వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగురామన్న

చెక్కులు అందుకున్న దండారీలతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఎదులాపురం, నవంబర్1: తెలంగాణ సాంస్కృతిక పండుగలకు ప్రాధాన్యమిచ్చింది బీఆర్ఎస్సేనని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడం లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్ చిన్నమాలేబోరిగాం గ్రామాల్లో ఏర్పాటు చేసిన దండారీ ఉత్సవాల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసులతో కలిసి గుస్సాడీ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని సీఎం కేసీఆర్ హయాంలో దసరా, బతుకమ్మ, దీపావళీ, తెలంగాణ సాంస్కృతిక పండుగలను వైభవంగా నిర్వహించేలా కృషి చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ 40 ఏళ్లు బీజేపీ పదేళ్లు కేంద్రంలో ఉన్నప్పటికీ జోడేఘాట్ అభివృద్ధికి ఎందుకు పాటు పడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలో కుమ్రం భీం విగ్రహాలు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో రూ.25 కోట్లతో జోడేఘాట్ అభివృద్ధి, కుమ్రం భీమ్ మ్యూజియంతో పాటు ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రం భీం పేరును పెట్టినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గిరిజనులకు 4 లక్షల ఎకరాల భూమికి పట్టాలు ఇచ్చి రైతుబంధు, రైతు బీమా అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, గంధ్రత్ రమేశ్, కుమ్ర రాజు, పరమేశ్వర్, అప్కామ్ గంగయ్య, వెంకటేశ్, బట్టు సతీశ్, కే విఠల్, దేవన్న, గెడం రాము, మర్సకోల పవన్ తదితరులు పాల్గొన్నారు.

బేల మండలంలో..

బేల, నవంబర్ 1 : మండలంలోని బాది(వాడగూడ), సైద్‌పూర్(జంగుగూడ), మసాలా(బీ), సదల్‌పూర్ తదితర గ్రామాల్లో దండారీ ఉత్సవాల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. దండారీ ఉత్సవాలకు రూ.15 వేలు ఇవ్వడం స్వాగతిస్తున్నామని, కానీ ఈ ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే గిరిజనులు చేసిందేమిటని ప్రశ్నించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రౌత్ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు సతీశ్ పవర్, కళ్యం ప్రమోద్ రెడ్డి, తన్వీర్ ఖాన్, మాష్క తేజరావ్, దీపక్ గౌడ్, విపిన్ ఖోడే పాల్గొన్నారు.

దండారీలకు చెక్కుల పంపిణీ

బోథ్, నవంబర్ 1 : మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనకు ఆదివాసులు గుస్సాడీ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 36 దండారీలకు రూ.15 వేల చొప్పున చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దండారీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ హయాంలో రూ.10 వేల చొప్పున దండారీలకు కేసీఆర్ అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు సురేందర్, కార్యకర్తలు, ఆదివాసులు పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో దండారీ వేడుకలు

ఇంద్రవెల్లి, నవంబర్ 1 : ఇంద్రవెల్లిని నాగోబా ఆలయంలో దండారీ వేడుకల్లో భాగంగా హీరాపూర్, రాయిగూడ తదితర గ్రామాల ఆదివాసీలు ప్రత్యేక పూజలు చేశారు. గుస్సాడీలతో పాటు ఆదివాసీ మహిళలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గ్రామ పటేళ్లు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో దండారీ పాటలపై నృత్యం చేస్తున్న ఆదివాసీ మహిళలు

అకాల వర్షం..అన్నదాతలకు నష్టం

బోథ్ : ధన్నూర్(బి)లో తడిసిన సోయాబిన్‌ను ఆరబెడుతున్న రైతు

దస్తురాబాద్/సోన్/నిర్మల్ అర్బన్/లోకేశ్వరం/బోథ్, నవంబర్ 1 : నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని పలు మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షంతో పంటలు దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలో పలు గ్రామాల్లో వర్షానికి వరి పంట నేలకొరిగింది. నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్, డ్యాంగాపూ ర్, చిట్యాల్, ముజ్గి, రత్నాపూర్‌కాండ్లీ, నీలాయిపేట్, మేడిపెల్లి, తదితర గ్రామాల్లో పంటలు నేలకొరగడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. లోకేశ్వరం మండలంలోని పొట్‌పెల్లి(బీ)లో బాండోల్ల రమేశ్ బొప్పాజీకి చెందిన ఎద్దు పిడుగుపాటుతో మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో కల్లాల్లో ఆరబెట్టిన సోయా పంట తడిసింది. ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి వర్షానికి తడిసింది. చేతికి వచ్చిన పంట నేలకొరిగిందని, ప్రభుత్వం, అధికారులు స్పందించి నష్టంపై సర్వే చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. నిర్మల్ పట్టణంలో వర్షంతో ఎన్‌టీఆర్ స్టేడియంలో పటాకులు విక్రయించే వ్యాపారులు ఇబ్బందిపడ్డారు. టీఎన్జీవో రోడ్డు వరద నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఆర్డీవో కార్యాలయంలోకి వరద నీరు చేరింది.